

'ఏడుపాయల'లో సామగ్రి సరఫరాకు ఒప్పందం

పాపన్నపేట, సెప్టెంబరు 18 : ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి సామగ్రి సరఫరా చేసేందుకు బుధవారం ఆలయ కార్యాలయంలో ఈవో చంద్రశేఖర్ సీల్ టెండర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మనీ వాల్యూ రశీదులు, ప్రింటింగ్ బుక్కుల సరఫరాకు రూ.2,919కి కొత్తపల్లికి చెందిన వెంకటరమణకు, ఒక్కో కండువాకు రూ.73, ఒక్కో కనుముకు రూ.47 చొప్పున ఏడాది పాటు సరఫరా చేసేందుకు భువనగిరికి చెందిన విజయ లక్ష్మి టెక్స్‌టైల్స్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నారు. టెండర్ల ఒప్పందంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీనారాయణ, తదితరులున్నారు.



సంగారెడ్డి అంబేద్కర్ జంక్షన్‌లో స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న జగ్గారెడ్డి

గణేష్ నిమజ్జన వేడుకల్లో జగ్గారెడ్డి

- పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, కుమారుడు దత్తుసాయిరెడ్డి, కూతురు జయారెడ్డి
- సంగారెడ్డిలో జోష్ నింపిన మాజీ ఎమ్మెల్యే

సంగారెడ్డి, సెప్టెంబర్ 18 : సంగారెడ్డి పట్టణంలో మంగళ వారం వైభవంగా జరిగిన గణేష్ నిమజ్జన వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొన్నారు. నిమజ్జన ర్యాలీలో సందడి చేశారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో స్వయంగా ఆయనే నియంత్రించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు. ఆర్కెస్ట్రా బృందాలు, డప్పుచప్పుళ్ల మధ్య కాలు కదుపుతూ జోష్ నింపారు. చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలోని గణపతి లడ్డూను జగ్గారెడ్డి కుమారుడు దత్తు సాయిరెడ్డి, రూ.15 లక్షలకు దక్కించుకున్నారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కుమారుడు దత్తు సాయిరెడ్డి, కుమార్తె జయారెడ్డి లడ్డూ ప్రసాదాన్ని స్థానికులకు పంచిపెట్టారు.



సంగారెడ్డిలోని చైతన్య యువజన సంఘం ఏర్పాటు చేసిన గణపతి లడ్డుతో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కుమారుడు దత్తుసాయిరెడ్డి, కూతురు జయారెడ్డి



ఐబీ గెస్ట్‌హౌజ్ నిమజ్జన ర్యాలీలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



పైసలు లేక.. పనులు సాగక

6

అర్ధాంతరంగా నిలిచిన నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణం





మెదక్ రాందాస్ చౌరస్తాలో వినాయకుడి శోభాయాత్రలో చిందేస్తున్న యువకులు, నారింజ ప్రాజెక్టు వద్ద నిమజ్జనానికి వరుస కట్టిన జహీరాబాద్ పట్టణ పరిధిలోని వినాయక విగ్రహాలు



కొంటూర్ చెరువులో క్రేన్ సహాయంతో నిమజ్జనం, మెదక్‌లో మహిళల కోలాటం నడుమ నిమజ్జనానికి తరలుతున్న భారీ గణనాథుడు



వెళ్లిరావయ్యా

దరువేస్తూ.. చిందేస్తూ ఉత్సాహంగా గణేశ్ శోభాయాత్ర

- జనసంద్రమైన మెదక్ రాందాస్‌చౌరస్తా
- ఉట్టి కొట్టిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు.. డప్పు వాయించిన మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి
- ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం



మెదక్ పట్టణంలో యువత కోలాహలం

మెదక్ అర్బన్, సెప్టెంబరు 18 : మెదక్ జిల్లాలో మంగళవారం ప్రారంభమైన శోభాయాత్రలు రెండో రోజు ఉత్సాహంగా కొనసాగాయి. బ్యాండ్ మోతలు, భజన కార్యక్రమాలు, డీజే చప్పుళ్లు, యువకుల చిందుల నడుమ శోభాయమానంగా సాగింది. మండపాల నిర్వాహకులు ప్రత్యేక వస్త్రాధారణలు ఆకట్టుకున్నాయి. ఆయా వినాయక మండపాల వద్ద లడ్డు వేలంపాట, లక్కీడ్రా నిర్వహించారు. శోభాయాత్ర నవాబుపేట, పిట్లంబేస్, పెద్దబజార్, మార్కెట్, చమన్, రాందాస్ చౌరస్తా, పాతబస్టాండ్, ఆటోనగర్ మీదుగా సాగింది. మెదక్ రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేదిక పరిసరాలు జనసంద్రంగా మారాయి. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు నిమజ్జనోత్సవంలో పాల్గొని ఉట్టి కొట్టారు. రాందాస్ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవందర్‌రెడ్డి డప్పు వాయిస్తూ సందడి చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు, యువకులతో కలిసి నృత్యం చేశారు. మున్సిపల్ తరఫున ఏర్పాటు చేసిన మెమెంటోలను మండపాల నిర్వాహకులకు అందజేశారు. వినాయక విగ్రహాలు వాహనాలు ఒకదాని వెంట ఒకటి మండల పరిధిలోని కొంటూరు చెరువుకు వరుస కట్టాయి. మూడు క్రేన్ల ద్వారా చెరువులో నిమజ్జనం చేశారు. ప్రతీ విగ్రహం వెంట పోలీసు బందోబస్తు కొనసాగింది. శోభయాత్రను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ నాగరాజు పర్యవేక్షించారు.

హోరెత్తిన సంబురం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 18 : రెండు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారమూ నిమజ్జనోత్సవం కోలాహలంగా జరిగింది. సంగారెడ్డి పట్టణంలో రెండో రోజూ నిమజ్జన సంబురం హోరెత్తింది. తెల్లవారుజాము 4 గంటల నుంచి వినాయక విగ్రహ వాహనాలు మహబూబ్‌సాగర్ చెరువుకు వరుస కట్టాయి. భారీ వినాయక విగ్రహాలను క్రేన్‌ల సహాయంతో నిమజ్జనం చేసేందుకు ఒక్కో ప్రతిమకు అరగంట సమయం పట్టింది. ఉదయం 11 గంటల వరకు నిమజ్జనం పూర్తయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నది.



ప్రతిష్ఠించిన చోటే..

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ఎంఐజీ కాలనీలో ప్రతిష్ఠించిన చోటే గణనాథుడిని నిమజ్జనం చేశారు. బుధవారం మట్టి వినాయకుడి ప్రతిమకు క్షీరాభిషేకం చేస్తూ నిమజ్జనం నిర్వహించారు.

- రామచంద్రాపురం, సెప్టెంబరు 18

వేధింపుల అధికారిపై కలెక్టర్ మండిపాటు!

చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 18 : 'స్మార్ట్‌ఫోన్ కొనుక్కో... వాట్సాప్‌లో చాటింగ్ చేయ్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ క్రాంతి తీవ్రంగా స్పందించారు. కలెక్టరేట్‌లోని ఓ శాఖ జిల్లా అధికారి అదే శాఖలోని మహిళా ఉద్యోగినిపై వేధింపులకు గురిచేయడాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. సదరు శాఖ జిల్లా అధికారిని కలెక్టర్ తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. ఉద్యోగులతో సోదరభావంతో ఉంటూ పనిచేయించుకోవాలే తప్ప ఇలాంటి పనులేంటని ఆగ్రహించినట్లు తెలిసింది. ఈ విషయమై కలెక్టర్ అంతర్గత విచారణకు ఆదేశించినట్లు సమాచారం. హైదరాబాద్‌లోని ఆ శాఖ ఉన్నతాధికారి కూడా విచారణ చేస్తున్నట్టు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన ఈ కథనం కలెక్టరేట్‌లోని వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ శాఖ అధికారి ఎవరంటూ ఆరా తీయడం వినిపించింది.

ముఖ్యమంత్రికి గ్యారెంటీలు అమలు చేసే శక్తి ఇవ్వాలి

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్



రంగంపేట ఆశ్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్

కొడిపల్లి/కోల్చారం/చిలప్‌చెడ్, 18 : ఆరు గ్యారంటీలు అమలు చేసే శక్తి భగవంతుడు సీఎం రేవంత్‌రెడ్డికి ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కోరుకున్నారు. కొల్చారం మండలంలోని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ ఆశ్రమానికి బుధవారం అసెంబ్లీ స్పీకర్ విచ్చేశారు. పీఠాధిపతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆశ్రమ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పీఠాధిపతి చతుర్మాస దీక్షలో ఉండగా, ఆశ్రమంలో స్పీకర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్పీకర్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నప్పటికీ, సీఎం రేవంత్‌రెడ్డి అకుంఠిత దీక్షతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. అలాగే, చిలప్‌చెడ్ మండల పరిధిలోని చిట్కుల్ చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కలెక్టర్ అభినందన





చిన్నారులకు చాక్లెట్లు ఇస్తున్న కలెక్టర్, అంగన్‌వాడీ టీచర్‌ను సన్మానిస్తున్న రాహుల్‌రాజ్

పాపన్నపేట, సెప్టెంబరు 18 : ఆకట్టుకునే బోధనోపకరణాలు.. చిత్రపటాలు.. విద్యార్థులు తయారుచేసిన బ్యాగులు.. నేలపైన పెయింట్‌తో వేసిన నంబర్లపై కూర్చున్న విద్యార్థులు.. ఏ చిన్నారిని కదిలించినా గలగలమంటూ చెప్పిన సమాధానాలు విని ఆనందానికి లోనయ్యారు కలెక్టర్ రాహుల్‌రాజ్. బుధవారం మండలంలోని ఎంకెపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయనకు చిన్నారులను, అంగన్‌వాడీ టీచర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చాక్లెట్లను పంపిణీ చేశారు. వినూత్న రీతిలో బోధన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ పరమేశ్వరి, ఆయా స్వప్నను సన్మానించారు. ఆయన వెంట డీపీవో యాదయ్య ఉన్నారు.



సంగారెడ్డిలోని ట్రాన్స్‌కో కార్యాలయం

సాధారణంగా కింది స్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు మూడేళ్లకోసారి బదిలీలు జరగాల్సి ఉంటుంది. పదోన్నతులు పొందిన వారికీ స్థానచలనం తప్పదు. కానీ, సంగారెడ్డి జిల్లా విద్యుత్ శాఖ (ట్రాన్స్‌కో)లో మాత్రం నిబంధనలకు పాతర వేసి కొంతమంది అధికారులు ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయారు. రెండు దశాబ్దాలకుపైగా ఒకే దగ్గర విధులు నిర్వహిస్తున్నారు. వారికి విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులతో పాటు ఉన్నతాధికారులు అండగా నిలవడం గమనార్హం.

ఇది మా అడ్డా

విద్యుత్ శాఖలో ఏళ్ల తరబడి ఒకే చోట

- అపాయింట్‌మెంట్ నుంచి బదిలీ కానీ అధికారులు
- పదోన్నతులు పొందినా స్థానచలనం లేదు

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 18 : సంగారెడ్డి ట్రాన్స్‌కో సర్కిల్ కార్యాలయంలోని పరిపాలన విభాగంలో(ఏడీఎం) ఓ ఉద్యోగి 25 ఏళ్ల క్రితం కాంట్రాక్టు ఉద్యోగిగా చేరి జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు పొందుతూ ఒకేచోట ఉన్నారు. జహీరాబాద్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయంలోని అకౌంట్స్ విభాగంలో మరో ఉద్యోగి 22 ఏళ్ల క్రితం ఎల్‌డీసీగా ఉద్యోగంలో చేరి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది అక్కడే పనిచేస్తున్నాడు. అలాగే సంగారెడ్డి సర్కిల్ కార్యాలయంలోని అకౌంట్స్ విభాగంలో పలువురు ఎల్‌డీసీలుగా చేరి ఏఏవోలు, ఏవోలుగా పదోన్నతులు పొంది అక్కడే ఉన్నారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో సబ్ ఇంజనీర్లుగా 20 ఏళ్ల క్రితం ఉద్యోగంలో చేరి ఏఈలుగా పదోన్నతులు పొంది ఒకేచోట పనిచేస్తున్నారు. మరో ఇద్దరు అధికారులు ఏఈ స్థాయి నుంచి డీఈలుగా పదోన్నతులు పొందినా కదలడం లేదు. జిల్లా ట్రాన్స్‌కోలో రెండు దశాబ్దాలుగా ఒకే చోట పనిచేస్తున్న వీరికి బదిలీ నిబంధనలు వర్తించడం లేదు. యూనియన్ల నాయకుల అండదండలతో ఉన్నతాధికారులను మేనేజ్ చేస్తూ ఇక్కడే పాతుకుపోయారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బదిలీల వేళ పైరవీల జోరు

విద్యుత్ శాఖలో బదిలీల కోసం సీఎండీ కార్యాలయం నుంచి లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, అధికారుల వివరాలు సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు అధికారులు, ఉద్యోగులు పైరవీలకు తెర లేపారు. యూనియన్ నాయకులు, ఉన్నతాధికారుల, మంత్రులను ప్రసన్నం చేసుకుని మరికొన్ని సంవత్సరాల పాటు ఇక్కడే ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే రాష్ట్ర విద్యుత్ శాఖలో ఐఏఎస్ అధికారి సీఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారుల్లో గుబులు నెలకొన్నది.

సహకార శాఖలోనూ ఇదే కథ

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో ఉన్న సహకార శాఖ కార్యాలయంలోనూ ఇద్దరు అధికారులు ఇరవై ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్నారు. ఆశాఖలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్‌తో పాటు మేనేజర్ 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ శాఖలో ఇటీవల బదిలీలు జరిగినప్పటికీ వీరికి మాత్రం స్థానచలనం కాలేదు.

ఆలయ భూమిలో సోలార్ వెలుగులు

- నిరుపయోగంగా నర్సాపూర్ లక్ష్మీనారాయణ దేవాలయ భూములు
- ప్లాంటు ఏర్పాటుతో సమకూరనున్న ఆదాయం
- అధికార యంత్రాంగం కసరత్తు



నర్సాపూర్‌లో జాతీయ రహదారికి ఆనుకుని నిరుపయోగంగా ఉన్న లక్ష్మీనారాయణస్వామి ఆలయ భూమి


నర్సాపూర్, సెప్టెంబరు 18 : జాతీయ రహదారికి ఆనుకుని, ఏళ్ల తరబడిగా నిరుపయోగంగా ఉన్న ఆలయ భూమిలో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తితో పాటు దేవదాయశాఖకు ఆదాయం చేకూరనున్నది. నర్సాపూర్ పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారికి ఆనుకుని 148 ఎకరాలకుపైగా భూమి ఉంది. ఇన్నాళ్లు నిరుపయోగంగా ఉన్న ఈ భూమిలో సోలార్ విద్యుదుత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి చెందిన. హైవేను ఆనుకుని ఉన్న ఈ విలువైన స్థలంలో కొంతభాగం డంప్‌యార్డుగా మారింది. మరి కొంతభాగం కౌలుకు ఇవ్వడంతో సాగుకు వినియోగిస్తున్నారు. సుమారు వంద ఎకరాల వరకు బీడుగా ఉంది. నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో విద్యాసంస్థలకు, పలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఇతర అవసరాలకు స్థలం అంటుబాటులో లేకపోవడంతో ఈ భూమిని వినియోగంలోకి తేవాలని గత బీఆర్‌ఎస్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రయత్నాలు చేశారు. దేవాదాయ శాఖ నుంచి ఆమోదం కూడా వచ్చినా ఎందుకో చివరివరకు ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఇప్పుడు మళ్లీ అదే భూమిలో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. సోలార్ ప్లాంటు కోసం అద్దెకివ్వాలనే ఆలోచనతో ఈ మధ్యనే సంబంధిత అధికారులు విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ఈ స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సమీంపలోని సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేసి సరఫరా చేస్తారు.



తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి

రేగోడు సెప్టెంబరు 18: ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి ఇక నుంచి తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని రేగోడు తహసీల్దార్ బాలలక్ష్మి తెలిపారు.



గ్రామ పంచాయతీ వర్కర్ల ధర్నా

మునిపల్లి, సెప్టెంబరు18 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వర్కర్లు బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్, మండల అధ్యక్షుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. ప్రమాదబీమా సౌకర్యం కల్పించడంతోపాటు ఐడీ కార్డు సబ్బులు, సరుకులు, సంవత్సరానికి రెండు జతలబట్టలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రామలింగంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విఠల్ గౌడ్, రవి, యాదమ్మ, నగేష్, ప్రభాకర్, నవీన్, బిక్షపతి, బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 18 :విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన చొప్పదండి శ్రీనివాస్, లావణ్య ఎన్జీవోస్‌కాలనీలో అద్దెఇంట్లో నివాసముంటున్నారు. బుధవారం మధ్యాహ్నం దుస్తులు ఉతికి ఇంటి ఎదుట ఆరేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు కేసు దర్యాప్తులో ఉంది.



సంగారెడ్డిలోని రాజంపేట రోడ్డులో అర్ధాంతరంగా నిలిచిన నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణ పనులు

పైసలు లేక.. పనులు సాగక

● అర్ధాంతరంగా నిలిచిన నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణాలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18 : సంగారెడ్డిలోని రాజంపేట రోడ్డులో నిర్మిస్తున్న నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మూడు నెలలుగా పనులు కొనసాగడం లేదు. పూర్తి చేసిన పనులకు సైతం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మిగిలిన పనులను కొనసాగించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సొంత జిల్లాలో ఈ పరిస్థితులు ఉండడం గమనార్హం.


పనులు చేసినా నయా పైసా రాలే !


రెండంతస్తుల నర్సింగ్ కాలేజీ భవనం, రెండంతస్తుల హాస్టల్ భవన నిర్మాణాలకు ప్రభుత్వం గత ఏడాదిలో రూ.34 కోట్లు మంజూరు చేసింది. వీటి నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వ ఏజెన్సీ అయిన టీజీఎంఎస్ఐడీసీ చేపట్టింది. కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసుకుని అగ్రిమెంట్ కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం ప్రకారం నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవన నిర్మాణాలన్నీ వచ్చే అక్టోబరులో పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలి. అయితే గతేడాది జూలైలోనే కాంట్రాక్టరు రూ.10 కోట్ల పనులను పూర్తి చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. దాంతో మిగిలిన నిర్మాణాలను ఎలా చేపట్టాలంటూ సదరు కాంట్రాక్టర్ ప్రశ్నిస్తున్నారు. పైసలు మంజూరు చేస్తేనే మళ్లీ పనులు ప్రారంభిస్తామని అప్పటి వరకు పనులు మొదలు పెట్టేది లేదని తేల్చిచెబుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితులపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించి ప్రభుత్వం నుంచి నిధులను విడుదల చేయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పిల్లర్ల దశలో నిలిచిన నర్సింగ్ కాలేజీ హాస్టల్ భవనాలు



















క్రీడా పాలసీకి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 18 : క్రీడా పాలసీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడా అధికారి మొగల్ ఖాసీం బేగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఎండీ ఆదేశాల మేరకు క్రీడా పాలసీని రూపొందించిందని పేర్కొన్నారు. 2019 నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు తమ వివరాలను కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడా కార్యలయంలో ఈ నెల 24వ తేదిలోగా సమర్పించాలని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వివరాలు, పొందిన పతకాలు, ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తులను వ్యక్తిగతంగా అందజేయాలని సూచించారు. క్రీడాకారులు సమర్పించే సమాచారాన్ని కోచ్, పీడీ, పీఈటీలు ధ్రువీకరించాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు 7981798957 నంబర్ ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను చోరీ చేసి.. బావిలో పడేసి..

తూప్రాన్, సెప్టెంబరు 18: దుండగులు ట్రాక్టర్‌ను చోరీ చేసి బావిలో వేసిన సంఘటన తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఉడుగుల శ్రీనివాస్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. యావాపూర్‌కు చెందిన సత్తయ్య పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. మంగళవారం ఎప్పటిలాగే కిష్టాపూర్ శివారులో మేకల కొట్టం వద్ద ట్రాక్టర్‌ను ఉంచాడు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను ట్రాలీతో సహా తీసుకెళ్లి శ్రీనివాస్ కౌలుకు చేస్తున్న పొలం వద్దగల బావిలో పడేశారు. బుధవారం ట్రాక్టర్ కనిపించకపోవడంతో టైర్ల జాడల ఆధారంగా వెతకగా బావిలో కనిపించింది. ఈ మేరకు బాధితుడు బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏటీఎంలో డ్రా చేయమంటే.. డబ్బులు కాజేశాడు

తూప్రాన్, సెప్టెంబరు 18 : ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసి ఇవ్వమన్నందుకు ఏటీఎం కార్డునే మార్చేసి డబ్బులు కాజేశాడు ఓ ప్రబుద్ధుడు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన వడ్ల గున్నాలు ఈ నెల 8న ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకోవడానికి వచ్చాడు. డబ్బులు చేయడం తెలియకపోవడంతో ఏటీఎం వద్దకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తిని డబ్బులు డ్రా చేసి ఇవ్వాలని ఏటీఎం కార్డు ఇచ్చాడు. అతడు డబ్బులు డ్రా చేసినట్లు ప్రయత్నించి ఏటీఎం కార్డు పని చేయడంలేదంటూ చెప్పి కార్డు (కార్డు మార్చి) ఇచ్చి వెళ్లిపోయాడు. వేరే వ్యక్తుల సహాయంతో ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నించినప్పటికీ డబ్బులు రాలేదు. బుధవారం గున్నాలు ఎస్‌బీఐ బ్యాంకు వచ్చి డబ్బులు డ్రా చేసేందుకు చూడగా, 8న రూ. 9,600 డ్రా చేసినట్లు గుర్తించాడు. ఈ విషయంలో గున్నాలు తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి బ్రెయిన్‌డెడ్

● అవయవాలు దానం చేసిన కుటుంబం


మురుగేంద్ర స్వామి (ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబరు 18: అత్యంత సాధారణ కుటుంబం ఎంతో ఉన్నతంగా ఆలోచించి ఆదర్శంగా నిలిచింది. బ్రెయిన్‌డెడ్ అయిన తమ కుటుంబ సభ్యుడి అవయవాలు అంత దుఃఖంలోనూ దానం చేయగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్లితే మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నివాసముంటున్న మురుగేంద్రస్వామి(45) స్థానికంగా మిర్చిల బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తీవ్ర గాయాలకు గురికాగా హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో తరలించారు. చికిత్స అందించిన వైద్యులు మురుగేంద్రస్వామి బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. దీంతో అతని కుటుంబీకులు జీవన్ దాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవాలు దానం చేసేందుకు అంగీకరించారు. మృతిడికి భార్య లక్ష్మీతో పాటు కూతురు, కుమారుడు ఉండగా కూతురుకు వివాహం జరిగింది.

భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదని యువరైతు ఆత్మహత్య


కామిని రాజు (ఫైల్)

తొగుట, సెప్టెంబరు 18: యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొగుట మండలం కాన్గల్ గ్రామంలో చోటుచేసుకుంది. తొగుట పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కామిని రాజు (31)కు పోసానిపల్లి గ్రామానికి చెందిన భవాని అలియాస్ దివ్యతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని రోజుల క్రితం దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో దివ్య పుట్టింటికి వెళ్లిపోయింది. దాంతో రాజు మద్యానికి బానిసగా మారాడు. ఇక తన భార్య రాదేమోనని భావించి మంగళవారం రాత్రి వ్యవసాయ బావివద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చస్తున్నట్లు తొగుట ఎస్‌ఐ రవికాంత్ రావు తెలిపారు.

తల్లితో గొడవపడి యువకుడు..


మధు(ఫైల్)

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 18 : తల్లితో గొడవపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట పట్టణంలోని రామ్‌నగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే రామ్‌నగర్‌కు చెందిన జిల్లా పద్మ చిన్న కుమారుడు జిల్లా మధు(28)తో కలిసి గుండ్ల చెరువు ప్రాంతంలో నివసిస్తుంది. డెకరేషన్ పనులు చేసే మధు మద్యానికి బానిసై డబ్బుల కోసం నిత్యం తల్లితో గొడవ పడేవాడు. మంగళవారం కూడా మద్యం తాగివచ్చి డబ్బులివ్వాలని తల్లితో గొడవపడగా తల్లి ఇవ్వలేదు. దీంతో మనస్తాపానికి గురైన మధు పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మైదానం లేక.. మరుగున ఆట

- కలగానే గజ్వేల్‌కు స్టేడియం..
- ఏళ్లుగా క్రీడాకారులకు తప్పని ఎదురుచూపులు
- మినీస్టేడియం ఉన్నా.. వసతులు సున్నా..
- గత ప్రభుత్వం భూమి కేటాయించినా.. ఫలితం శూన్యం


స్టేడియం నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం కేటాయించిన స్థలం

గజ్వేల్, సెప్టెంబరు 18: గజ్వేల్ పట్టణ, నియోజకవర్గ క్రీడాకారుల చిరకాల ఆశ నెరవేరడం లేదు. గజ్వేల్ ఎంతో అభివృద్ధి జరిగిందని గతంలో అధికార , ప్రతిపక్ష నాయకుల నోళ్లలో నానినా గజ్వేల్‌కు క్రీడా మైదానం మాత్రం దక్కడం లేదు. గత ప్రభుత్వం గజ్వేల్‌లో ఆధునిక హంగులతో స్టేడియం ఏర్పాటు చేస్తామని ప్రకటించి, ప్రస్తుతం ఉన్న మినీ స్టేడియానికి ఆనుకుని ఉన్న ఆరు ఎకరాల భూమిని సేకరించింది. అయినా ఇప్పటికీ ఆ భూమికి హద్దులు కూడా చూపించలేదు. దీంతో స్టేడియం లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. క్రీడామైదానంతో పాటు క్రీడా సామాగ్రి అందజేస్తే యువతీ, యువకులు ప్రాక్టీసు చేసే వెసులుబాటు ఉంటుంది. కానీ పట్టణ విస్తరణ పెరిగినప్పటికీ ప్రజలకు అవసరమైన స్టేడియం, క్రీడాప్రాంగణం లేదు. ఇక మినీ స్టేడియం ఉన్నా అందులో వసతులు లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే స్టేడియంలో ఆర్టీఏ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు.

క్రీడల్లో వెనకబడుతున్న గజ్వేల్ యువత

గజ్వేల్ పట్టణంతో పాటు నియోజకవర్గవ్యాప్తంగా అనేక క్రీడల్లో నైపుణ్యం కలిగిన యువత ఉన్నారు. అయితే సరైన మైదానం, క్రీడా శిక్షకులు లేకపోవడంతో యువతలోని నైపుణ్యం మరుగున పడుతున్నది. గజ్వేల్‌లో క్రీడా మైదానం ఏర్పాటు చేస్తే గజ్వేల్ నియోజకవర్గంతో పాటు దుబ్బాక నియోజకవర్గ యువ క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడనుంది.

ఆర్‌టీఏ కార్యాలయంగా మినీ స్టేడియం..

గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డులో మినీ స్టేడియం ఉన్నా పెద్దగా ప్రయోజనం లేదు. పట్టణానికి దూరంగా ఉండడం, రాత్రైతే ఆ ప్రాంతంలో ఎవరూ ఉండకపోవడం, చుట్టూ మందుబాబులు సిట్టింగ్ వేస్తుండడంతో క్రీడాకారులు ఆ స్టేడియానికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. సరైన రవాణా సౌకర్యం లేకపోవడం ప్రధాన సమస్యగా చెప్పవచ్చు. ఇకపోతే ప్రస్తుత మినీ స్టేడియంలో గజ్వేల్ ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఇక్కడ పూర్తి స్థాయిలో ఆర్టీఏ సేవలు అందుబాటులో ఉంటుండడంతో క్రీడాకారులకు సమస్యగా మారింది.

పట్టణంలో అందుబాటులో లేని స్థలం

గజ్వేల్‌తో పాటు ప్రజ్ఞాపూర్‌లో సైతం ఎక్కడా క్రీడా మైదానం నిర్మాణానికి ప్రభుత్వం స్థలం అందుబాటులో లేకపోవడం పెద్ద మైనస్. గతంలో గ్రామపంచాయతీగా ఉన్న సమయంలోనే స్టేడియం నిర్మాణానికి స్థలాన్ని అన్వేషించినా ఎక్కడా స్థలం లభించకపోవడంతో తూప్రాన్ రోడ్డులో మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్టేడియం ఏర్పాటుకు గజ్వేల్ క్రీడాకారులు, యువజన సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమాలే చేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు స్టేడియం నిర్మాణం జరిగినా పూర్తిస్థాయిలో ఆటవస్తువులు లేకపోవడం, అన్ని క్రీడలకు సరిపడా స్థలం లేకపోవడంతో క్రీడల నిర్వహణ ఇబ్బందిగా మారింది. ప్రస్తుతానికి పలువురు వాకర్స్, క్రికెట్, ఇతర క్రీడలను శివాలయానికి సంబంధించిన మైదానంలోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక యువతీ, యువకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు కోరుతున్నారు.


మినీ స్టేడియంలో కొన సాగుతున్న ఆర్‌టీఏ కార్యాలయం

గజ్వేల్ పట్టణంలోని ప్రస్తుత మినీ స్టేడియం

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

● డీపీఎం ప్రకాష్


మాట్లాడుతున్న డీపీఎం ప్రకాష్

చేగుంట, సెప్టెంబరు 18 : డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదుగాలని డీపీఎం ప్రకాష్ అన్నారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలోని ఏడవ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మహిళల సంఘాలకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బ్యాంకు రుణాలు పొంది కుటీర పరిశ్రమలు, తదాతర ఉపాధి కల్పించుకోవాలని సూచించారు. రుణాలు పొందిన సకాలంలోనే కొత్తవారికి బ్యాంకు రుణాలు కల్పించేందుకు కృషి చేయాలని సీసీలకు ఆదేశాలు జారీ చేశారు. బ్యాంకు లింకేజీల ద్వారా శ్రీనిధి రుణాలను సక్రమంగా పొందేందుకు సహకరించాలని కోరారు. 15 గ్రామల్లోని 375 మహిళా సంఘాలకు 3750 సభ్యుల వార్షిక ఆదాయాన్ని మహిళా అధ్యక్షురాలు మైలారం అనిత డీపీఎంకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం ఆశోక్, సీసీలు సుల్తాన, శంకర్, ఆయా గ్రామాల మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేక్మాల్, సెప్టెంబరు18 : పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శిశు సంక్షేమ శాఖ అధికారులు రమేష్, కవిత అన్నారు. బుధవారం మండలంలోని జూనియర్ కళాశాలలో శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులను లైంగిక వేధింపుల నుంచి రక్షించడానికి ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి ఉదాహరణతో సహా వివరించారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి 10 ఏళ్లు అయినా ఇంకా ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం ఎంతో బాధాకరమని అన్నారు. శారీరకంగా, మానసికంగా చిన్నారులు ఆనందకరమైన బాల్యాన్ని పొందడం వారి హక్కు అన్నారు. లైంగిక వేధింపులపై ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్‌చంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ద్విచక్రవాహనం చోరీ

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 18 : బైకు చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్లితే సంగారెడ్డి పట్టణంలోని గంజిమైదానంలో గల నుమానియా మసీదు ఇమామ్ రహ్మతుల్లాకు చెందిన టీఎస్15 బీఈఆర్ 4785 నంబరు గల ద్విచక్రవాహనాన్ని ఈ నెల 16న గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ మేరకు బాధితుడు సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేసి నిందితుడిని గుర్తించి తన ద్విచక్రవాహనాన్ని ఇప్పించాలని బాధితుడు పర్యాదులో కోరారు.

అనుమానం.. పెనుభూతమై..

● క్షణికావేశంలో నిండు ప్రాణం బలి


అనూష(ఫైల్)

మర్కుక్, సెప్టెంబరు 18: అవమాన భారం తట్టుకోలేక ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు మర్కుక్ ఎస్సై దామోద ర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన కనకయ్య కొమురయ్య దంపతుల కూతురు అనూష(21) మర్కుక్ గ్రామానికి చెందిన అయ్యన్నగారి నవీన్ అనే యువకుడికి ఇచ్చి ఏడాది కిందట వివాహం జరిపించారు. అనూష చరవాణిలో వేరే వ్యక్తులతో మాట్లాడుతుందని భర్త నవీన్ ఆమెను కొట్టి అవమానపరిచాడు. అనూష ఈ విషయాన్ని నవీన్ సోదరుడు కరుణాకర్‌కు తెలిపింది. కరుణాకర్ కూడా అనూషను అనుమానిస్తూ వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఇంటికి తీసుకువెళ్లాలని సూచించాడు. దీంతో భర్త నవీన్ అతని సోదరుడు కరుణాకర్‌లు పెడుతున్న బాధలు, అవమానాలు తట్టుకోలేక అనూష మంగళవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. వెంటనే ఆమెను చికిత్స కోసం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి కనకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవీన్ అతని సోదరుడు కరుణాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

3 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18 : ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి 9 వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 16 నుంచి 23 వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. గతంలో అడ్మిషన్ పొంది పరీక్షలకు హాజరుకాని వారు, పరీక్షలకు హాజరై ఫెయిలైన వారు ఈ పరీక్షలు రాయుటకు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమ్మె షురూ

● ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నిలిచిన అడ్మిషన్లు


ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగులు సమ్మెలో ఉన్నారంటూ ఏర్పాటు చేసిన స్టిక్కర్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ఉద్యోగులు బుధవారం నుంచి సమ్మె బాట పట్టారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ-ఆయుష్మాన్‌భారత్ వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల ఉద్యోగులు లేని కారణంగా ఆరోగ్య శ్రీ కింద రోగులను అడ్మిట్ చేసుకోలేదని ఆయా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మరికొన్ని ఆస్పత్రుల్లో ఆపరేటర్లకే ఆరోగ్య మిత్రల లాగిన్ ఐడీలు ఇచ్చి వైద్య సేవలు కొనసాగించినట్లు తెలిసింది.

ట్రస్టు కార్యాలయానికి తరలిన ఉద్యోగులు

ఆరోగ్యశ్రీ ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా తొలి రోజు హైదరాబాద్‌లోని ఆరోగ్య శ్రీ ట్రస్టు కార్యాలయానికి తరలివెళ్లారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 46 మంది తరలివెళ్లి ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య మిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు హిమగిరి ప్రసాద్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి 42 రోజులు గడుస్తున్నా- స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చే వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు రాజు, గాయత్రీ, ఎం.రాజు, వినోద్, ఖైరున్నిసా తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోండి

● గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గౌతమరావు


ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గౌతమరావు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 18 : గీతంలో ఆర్థిక శాస్త్రం బోధిస్తున్న అధ్యాపకులు తమ బోధన, పరిశోధనా నైపుణ్యాలను మరింత మెరుగు పరచుకోవాలని గీతం ఉప కులపతి (ఇన్‌చార్జి) ప్రొఫెసర్ వైగౌతమరావు సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో మూడురోజులపాటు నిర్వహించనున్న అధ్యాపక వికాస కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గౌతమరావుతోపాటు గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, జీఎస్ హెచ్‌ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ జిసన్నీ జోష్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా ధోరణులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవడంపె దృష్టి పెట్టాలని అధ్యాపకులకు సూచించారు. ఈ మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి బిట్స్ హైదరాబాద్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భీమేశ్వరెడ్డి ప్రధాన వక్తగా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జీఎస్‌ఎహెచ్‌ఎస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నెల్సన్ మండేలా షణ్ముగం సమన్వయం చేశారు.

బస్సు టైరు పేలి మహిళలకు గాయాలు


గాయపడిన మహిళలను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

హుస్నాబాద్, సెప్టెంబరు 18 ఆర్టీసీ అద్దె బస్సు టైరు పేలడంతో మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు పట్టణంలోని బస్టాండ్ నుంచి కరీంనగర్ వెళ్తున్న సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద ఒక్కసారిగా టైరు పేలింది. ఈ ధాటికి టైరు పైన ఉన్న రేకు పైకి లేచి సీటులో కూర్చొని ఉన్న పెద్దపల్లి జిల్లా పెగడపల్లి గ్రామానికి చెందిన బుర్ర ప్రవళిక, గోదావరిఖని సుందిళ్ల గ్రామానికి చెందిన బుర్ర కళ్యాణి, అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామానికి చెందిన మాలోతు శశిప్రియతో పాటు మరో మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సనందించారు. టైరు పేలుడు ధాటికి పెద్దగా శబ్దం రావడంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కాగా ఈ ఘటన స్థలం వద్ద ప్రజలు, వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

- వెదజల్లే పద్ధతితో వరి సాగులో రాణిస్తున్న గుమ్మడిదల రైతులు
- ఆరుతడి పంటల్లా దుక్కిలోనే సాగు..
- నీరు ఆదా.. ఆసక్తి చెబుతున్న రైతులు
- ప్రోత్సహిస్తున్న వ్యవసాయ అధికారులు

గుమ్మడిదల, సెప్టెంబరు 18 : గుమ్మడిదల అంటేనే జిల్లాలో అందరికి వ్యవసాయం మండలంగా గుర్తుకొస్తుంది. కొత్త పద్ధతులను అనుసరించి వ్యవసాయం చేయడంలో ఇక్కడి రైతులు ఎప్పుడూ ముందుంటారు. వ్యవసాయ అధికారులు సూచించిన విధానాలను పాటించి కొత్త పద్ధతులలో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ సాగులో కొత్త మార్పులను అనుసరిస్తూ విజయం సాధిస్తున్నారు.

వెద్దజల్లే పద్ధతిలో వరి...

నాటి నుంచి వస్తున్న వరిసాగులో నారుమడి విధానానికి స్వస్తి పలికి వెదజల్లే సాగు పద్ధతిలో గుమ్మడిదల మండల రైతులు రాణిస్తున్నారు. గత ఏడాది వర్షాలు సమృద్ధిగా కురువకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయాయి. దీంతో యాసంగిలో రైతులు వరి సాగు అంతత మాత్రమే చేశారు. వర్షాధార పంటలైన మొక్కజొన్న మాదిరిగా వరి సాగు చేసుకోవచ్చని గత మూడేళ్లుగా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తునే ఉన్నారు. కానీ నీళ్లు సమృద్ధిగా ఉండటంతో రైతుల ఆ పద్ధతిని అంతగా పట్టించుకోలేదు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా రావడం భూగర్భ జలాలు అడగంటడంతో బోరుబావులలో సైతం నీరు లభించడం లేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగులో ఈ ప్రాంత రైతులు వెదజల్లే పద్ధతి సాగు వైపు మొగ్గు చూపారు. మండలంలోని గుమ్మడిదల, కానుకుంట, కొత్తపల్లి, నల్లవల్లి, నాగిరెడ్డి గూడెం గ్రామాలలో ఈ ఏడాది దాదాపు 700 వందల ఎకరాలలో రైతులు వెదజల్లే పద్ధతిలోనే వరి సాగు చేస్తున్నారు.

మూడు నెలల్లోనే పంట చేతికి..

వెదజల్లే పద్ధతిలో కేవలం మూడు నెలల్లోనే పంట చేతికొస్తుంది. వేసవి దుక్కుల సమయంలో పొలాన్ని మెత్తగా దున్ని మొక్కజొన్న విత్తనాలు ఏ విధంగా వేస్తారో వరి విత్తనాలు కూడా గొర్రు నాగలి వెంబడి వేసుకోవాలి. లేదా ట్రాక్టర్ సహాయంతో కూడా వేసుకోవచ్చు. కొందరు రైతులు కరిగేటలో తుకం చల్లినట్లు కూడా చల్లుకుంటారు. బోరు బావుల సౌకర్యం నీటి వసతి లేని వారు వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేసుకోవచ్చు. ఇప్పటికే గుమ్మడిదల మండలంతో పాటు కానుకుంట, కొత్తపల్లి నల్లవల్లి నాగిరెడ్డి గూడెం తదితర గ్రామాల్లో వెదజల్లే పద్ధతి (దుక్కి) లో సాగు చేస్తున్నారు. నారుమడి సాగుకు కంటే దీనివల్లఎకరాకు 10వేల ఖర్చు ఆదా అవ్వడంతోపాటు 25-30 క్వింటాల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 10 కేజీల విత్తనాలు సరిపోతాయి. అన్ని విధాలుగా బాగుండడంతో రైతులు ఈ పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు. గుమ్మడిదల రైతులు పంటల్లో చీడపీడల నివారణకు ఎప్పటికప్పుడు అధికారుల సూచనలు పాటిస్తూ వరి సాగులో రాణిస్తున్నారు


వెదజల్లే పద్ధతితో గొర్రు సహాయంతో సాగు చేసిన వరి పంట..

పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది..



గుమ్మడిదల మండలంలో రైతులు వ్యవసాయ అధికారులు చెప్పినట్లు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. అంతేకాకుండా దిగుబడి బాగా పెరుగుతుంది. మండలంలో రైతులు వరి విత్తనాలు గొర్రుకు వేస్తున్నారు. గతంలో గుమ్మడిదల మండలంలో మూడేళ్ల క్రితం వరి సాగులో వెదజల్లే పద్ధతి పాటించడంలో రైతులు ఎన్నో అనుమానాలు వ్యక్తం చేశారు. కానీ, ప్రస్తుతం అధిక సంఖ్యలో రైతులు ఆ పద్ధతిని పాటించడం ఆనందం ఉంది. దీనివల్ల రైతులకు తక్కువ ఖర్చు పంట ఎక్కువ దిగుబడి వస్తుంది. అంతేకాకుండా సాగునీరు భారీగా ఆదా అవుతుంది.

-శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి గుమ్మడిదల

శ్రమ కూడా తక్కువే..



వెదజల్లే పద్ధతిలో ఇప్పటికే మా గ్రామంలో ఎక్కువ శాతం రైతులం వరి సాగు చేశాం. ఈ పద్ధతి వల్ల రైతులకు శ్రమతో పాటు తక్కువ ఖర్చు అధిక దిగుబడి వస్తుంది. వ్యవసాయ అధికారులు సలహాలు సూచనలు ఇవ్వడంతో తాము వెదజల్లే పద్ధతితో పాటు గొర్రుతో వరి విత్తనాలు వేస్తున్నాం. చాలావరకు నీరు ఆదావుతుంది. కూలీల ఇబ్బందులూ ఉండవు.

-అమ్మగారి రవీందర్ రెడ్డి, రైతు గుమ్మడిదల


సంగారెడ్డిలోని శాంతినగర్‌లో వినాయక మండపంలో కాలనీవాసుల పూజలు


జహీరాబాద్ : హరేరామ హరేక్రిష్ణ సంస్థాన్ సభ్యులకు మెమొంటోను అందజేస్తున్న మాణిక్‌రావు, గిరిధర్‌రెడ్డి


జహీరాబాద్ : నారింజప్రాజెక్టుకు నిమజ్జనానికి వాహనాల్లో తరలుతున్న వినాయక ప్రతిమలు


నారాయణఖేడ్: మంగల్‌పేటలో బాల వారీకార్‌ల భజనతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం


కల్హేర్‌లో వినాయకులను నిమజ్జనం చేస్తున్న భక్తులు


మునిపల్లిలో వినాయకునికి పూజలు చేస్తున్న మాజీ జడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, నాయకులు


హవేళిఘణపూర్‌లో భారీ వినాయక ప్రతిమను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


నర్సాపూర్‌లో నిమజ్జనానికి ముందు వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు

గంగమ్మ ఒడికి గణేషుడు

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 18: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వినాయక నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథుడి ప్రతిమలు గంగమ్మ ఒడికి చేరాయి. మంగళవారం మొదలైన నిమజ్జన శోభాయాత్రలు బుధవారం సైతం కొనసాగాయి. అలంకరించిన ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను ప్రధాన రహదారిపై అట్టహాసంగా ఊరేగింపులు నిర్వహించారు. దారి పొడవునా మహిళలు హారతులతో స్వాగతం పలికారు. వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన ప్రత్యేక బ్యాండ్ మేళాలు, డప్పుచప్పుళ్లతో ఊరేగింపులు కొనసాగాయి. జహీరాబాద్‌లోని గణేష్ ప్రతిమలను నిమజ్జనం నిమిత్తం కొత్తూర్(బి) గ్రామంలో గల నారింజ ప్రాజెక్టుకు తరలించారు. సుమారు 100 వినాయక విగ్రహాలను బుధవారం తెల్లవారుజామున నిమజ్జనం చేశారు. నారింజప్రాజెక్టు వద్ద బీదర్‌రోడ్డుపై వినాయవిగ్రహాలతో వాహనాలు బారులు తీరాయి. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, సంగారెడ్డి ఎస్పీ రూపేష్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఉత్సవకమిటీ సభ్యులకు, భక్తులకు, సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేస్తూ నిమజ్జనంలో ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు.జహీరాబాద్‌లో హరేరామ, హరేక్రిష్ణ సంస్థాన్ వారు చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను గుర్తించి సంస్థాన్ సభ్యులను సన్మానించి మొమెంటోను అందజేశారు. ఖేడ్ మున్సిపాలిటీపరిధిలోని వినాయక విగ్రహాల నిమజ్జనం మనూరుమండలంలోని కమలాపూర్ చెరువులో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు వరకు కొనసాగింది. ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని హనుమాన్‌మందిర్‌లో ప్రతిష్ఠించిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఉద్గీర్‌కు చెందిన బాల వారీకార్ భజనకారులు సంప్రదాయ బద్ధంగా పంచకట్టులో తాళాలు, మృదంగంతోపాటు పాటల గీతాలతో హోరెత్తించారు. నారాయణఖేడ్ ఆర్టీసీ బస్టాండ్ ముందు గజానన్ గణేష్‌మండలి వారి నిమజ్జన యాత్రలో బుధవారం కేరళ, పంజాబ్ కళాకారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో వినాయకుల నిమజ్జన శోభాయాత్ర బుధవారం ఉదయం ఘనంగా కొనసాగింది. స్థానిక కామునిచెరువులో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో వినాయకులను స్థానిక చెరువులో నిమజ్జం చేశారు. మునిపల్లి మండల కేంద్ర మైన మునిపల్లి గ్రామ కృషి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద బుధవారం మాజీ జడ్పీటీసీ మైతర సాయికుమార్ ప్రత్యేక పూజలు చేశారు. హవేళిఘణపూర్‌లోని నేతాజీ గణేష్ మండలివారు నిర్వహించిన గుస్సాడి కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నర్సాపూర్‌లోని బృందావన్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం నిమజ్జనానికి ముందు డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో పాటు పలువురు నాయకులు గణేషుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.


నారాయణఖేడ్: గణనాథుడి నిమజ్జనయాత్రలో పంజాబీ కళాకారులు విన్యాసం

పోటాపోటీగా లడ్డూ వేలం

జహీరాబాద్/నారాయణఖేడ్/కల్హేర్/రామచంద్రాపురం/మనోహరాబాద్, సెప్టెంబరు 18: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో లడ్డూ ప్రసాదాలకు వేలంపాటలు పోటాపోటీగా కొనసాగాయి. జహీరాబాద్‌లోని రాచన్నపేటలో వినాయకుడి లడ్డూను హైదరాబాద్‌కు చెందిన ప్రీతీచైతన్యగుప్తా రూ.3.12లక్షలకు, ఆదర్శనగర్‌కాలనీలో వినాయకుడి లడ్డూను పట్లోళ్ల వెంకట్‌రెడ్డి రూ.2.51లక్షలకు, నాగులకట్ట ప్రాంతంలోని త్రిశూల్ సేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డును శ్రీజా ఇండస్ట్రీస్ ఛైర్మన్ శాస్విరెడ్డి రూ.2.50 లక్షలు, సాయినగర్‌కాలనీలో వినాయకుడి లడ్డూను రాయికోడ్ మండలం జంబ్గికి చెందిన ప్రశాంత్‌రెడ్డి రూ.2.33 లక్షల చొప్పున వేలంపాటలో పోటీపడి దక్కించుకున్నారు. నారాయణఖేడ్ పట్టణంలో హిందూసేన గణేష్ మండలివారి గణేష్‌లడ్డూను వేలంవేయగా పట్టణానికి చెందిన సంతోష్‌కుమార్ వ్యక్తి రూ.1,51,016లకు దక్కించుకున్నారు. కల్హేర్ మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను రూ. 71 వేలకు సిర్గాపూర్‌కు చెందిన నిమ్మలి రాములు వేలం పాటలో దక్కించుకున్నాడు. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లోని చిల్డ్రన్స్ పార్కు వద్ద సాయిగణేష్ యూత్ గణేష్ లడ్డూను వేలం పాటలో దోసాడ సంతోష్‌రెడ్డి రూ.4.26లక్షలకు, ఉస్మాన్‌నగర్‌లో మహారాజ్ మండపంలోని పెద్ద లడ్డూను పర్స శివయ్య రూ.3లక్షలు, ఇదే మండపంలోని చిన్న లడ్డూను ఎన్ రాజు 1.20లక్షలకు కైవసం చేసుకున్నారు. సిద్దివినాయక మండపంలోని లడ్డూను రూ. 1.30లక్షలకు కావలి నర్సింహులు ముదిరాజ్, చిన్నలడ్డూను బి.వేణు రూ.55వేలకు దక్కించుకున్నారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలోని క్రేజీబాయ్స్ ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాటలో గ్రామానికి చెందిన వర్గంటి రఘురాంరెడ్డి రూ. 2లక్షల ఒక వేయికి ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే యూత్ గణపతి లడ్డు వేలం పాటలో రూ.1,05,000లకు గంగిడి మల్లారెడ్డి కైవసం చేసుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన మెదక్ డీఈవో


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 18: మండలకేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను డీఈవో రాధాకిషన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 11 మంది ఉత్తమ ఉపాధ్యాయులను బుధవారం డీఈవో, ఎంఈవో బుచ్యానాయక్‌తో కలిసి శాలువాలు, మెమొంటోలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బుచ్యానాయక్, నోడల్ అధికారి వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు విఠల్, రాజేశ్వర్‌రావు, విజయ్‌కుమార్, ఆయాఉపాధ్యాయ సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

● రేగోడు సెప్టెంబరు 18: విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగించవద్దని బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల స్థానంలో కాంట్రాక్టు ఉపాధ్యాయులను నియమించి కొనసాగించాలని మెదక్ డీఈవో రాధాకిషన్ తెలిపారు. బుధవారం రేగోడు మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ చేశారు. మోడల్ పాఠశాలలో బదిలీపై ఉపాధ్యాయులు వెళ్లిపోగా వారి స్థానాల్లో ఎవరూ రాలేదని తెలిపారు. కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించుకొని అంతరాయం లేకుండా విద్య కొనసాగించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని లేదా మార్చాలని సూచించారు. పూర్తయిన హాస్టల్ భవనాన్ని వినియోగంలోకి తేవాలని సూచించారు. అనంతరం రేగోడు కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని పరిశీలించారు రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ, కస్తూర్బా బాలికల విద్యాలయ ప్రత్యేక అధికారి స్వయంప్రభ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 18: విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వఉన్నతపాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో బుచ్యానాయక్, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రామచంద్రచారి, నోడల్ అధికారి వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు విఠల్, రాజేశ్వర్‌రావు, విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడల్లో విజేతలకు బహుమతులు

నర్సాపూర్, సెప్టెంబరు 18: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నర్సాపూర్ మండల స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం ఎంఈవో బుచ్యానాయక్ ఆధ్వర్యంలో బహుమతులు అందచేశారు. నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యాలయ మైదానం నిర్వహించిన పోటీలలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపినవారికి ఎంఈవో బుచ్యానాయక్, నోడల్ ఆఫీసర్ తారాసింగ్ చేతుల మీదుగా బహుమతులు అందచేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

పటాన్‌చెరు, సెప్టెంబరు 18: అర్హులైనవారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయనున్నట్టు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆరుగ్యారెంటీల్లో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేసే మహాలక్ష్మి పథకాన్ని నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఎమ్మెల్యే గుర్తుచేశారు. బుధవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాపాలనలో భాగంగా పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్లు, ఆయా గ్రామాల పరిధిలో ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధుఆదర్శరెడ్డి, పుష్పనగేష్, మెట్టుకుమార్‌యాదవ్, ప్రత్యేక అధికారి దేవుజ, ఎంపీడీవో యాదగిరి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18: రక్తదానం ప్రాణదానంతో సమానమని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి చౌరస్తాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం యువమోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌యాదవ్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి రక్తదానం చేశారు. మోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని దేశవ్యాప్తంగా 15 రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామని, అందులో భాగంగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటనర్సింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ అండ

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 18: సంగారెడ్డి పట్టణానికి చెందిన ఓ పోలీసు కానిస్టేబుల్ కొంత కాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. సంగారెడ్డి పట్టణం శివాజీనగర్‌కు చెందిన రవీందర్ 1998లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా నియామకమై ప్రస్తుతం పుల్కల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. కానిస్టేబుల్ మృతదేహాన్ని బుధవారం సంగారెడ్డి పట్టణంలోని ఆయన స్వస్థలం శివాజీనగర్‌కు తీసుకొని రాగా జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పోలీసు శాఖ తరపున రావాల్సిన బెనిఫిట్స్‌ను సకాలంలో అందజేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా రూ.20వేల నగదును రవీందర్ కుటుంబానికి అందజేశారు. ఆయన వెంట పుల్కల్ ఎస్ఐ క్రాంతి, పోలీసు సంఘం అధ్యక్షుడు దుర్గారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఓటరు నమోదుకు సహకరించాలి'

నారాయణఖేడ్/తూప్రాన్, సెప్టెంబరు 18: ఓటరు నమోదు కార్యక్రమానికి రాజకీయపార్టీలు సహకరించాలని ఆర్డీవో అశోక చక్రవర్తి కోరారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఓటరు నమోదుకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతోసమావేశాన్ని నిర్వహించారు. కాగా గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రచురణపై సలహాలు సూచనల కోసం గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తూప్రాన్ ఎంపీడీవో శేషాద్రి, వెల్దుర్తి ఎంపీడీవో ఉమాదేవి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

'మొక్కలు ఒక జ్ఞాపకం'

తూప్రాన్, సెప్టెంబరు 18: నాటిన మొక్కలు మన మరణానంతరం ఒక జ్ఞాపకంగా భూమి మీద నిలిచి ఉంటాయని జీఎంఆర్ ఫైవేస్ సీఈవో అరుణ్ కుమార్ శర్మ పేర్కొన్నారు. బుధవారం తూప్రాన్ పట్టణ పరిధి టోల్‌ప్లాజా వద్ద ప్లాంట్ 'ఏ ట్రీ ప్లాంట్.. ఏ మెమరీ' కార్యక్రమంలో పాల్గొని హెడ్ శంకర్ గణేశన్‌తో కలిసి మొక్కను నాటారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్

నారాయణఖేడ్, సెప్టెంబరు 18: ఖేడ్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బుధవారం హైదరాబాద్ వెళ్లి తిరిగి ఖేడ్‌కు చేరుకుంది. ప్రయాణికులంతా దిగి పోగా బస్సులో కండక్టర్ పిట్ల రవీందర్‌కు ఓ పర్సు దొరికింది. అధికారుల సమక్షంలో తెరచి చూడగా అందులో ఓ ఫోన్‌తోపాటు రూ.1150 నగదు ఉంది. ఫోన్‌లోని కాంటాక్ట్ లిస్టులో పర్సు పోగొట్టుకున్న మహిళ కుమారుడికి ఫోన్‌కు చేసి, సంబందిత మహిళదేనని నిర్ధారించుకుని డిపో అధికారుల సమక్షంలో పర్సును బాధిత మహిళకు అందజేశారు. కండక్టర్ నిజాయితీని అందరూ మెచ్చుకున్నారు.

పత్తి పంటను పరిశీలించిన అధికారులు

హత్నూర, సెప్టెంబరు 18: పత్తి పంట సస్యరక్షణపై రైతులకు అవగాహన అవసరమని జిల్లా సస్యరక్షణ కేంద్రం అధికారి సునీత అన్నారు. బుధవారం హత్నూర మండలం కాసాల రైతు వేదికలో రైతులు సాగు చేసే పత్తి పంట సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రెండు రోజుల పాటు నిర్వహించే అవగాహన సదస్సును జిల్లా కేంద్రీయ సస్యరక్షణ కేంద్రం అధికారి సునీత ప్రారంభించారు. కార్యక్రమంలో డీఏవో శివకుమార్, టీటీసీ కోఆర్డినేటర్ రాహుల్ విశ్వకర్మ, ఏవో శ్రీనివాస్, ఏఈవో లు, రైతులు పాల్గొన్నారు.

'దుండగులను కఠినంగా శిక్షించాలి'

నిజాంపేట, సెప్టెంబరు 18: మెదక్ జిల్లా శివ్వంపేట్ మండల్ కొంతాన్‌పల్లిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు నిజాంపేట మండల అధ్యక్షుడు బండారి చంద్రయ్య అన్నారు.

● శివ్వంపేట: అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినందుకు నిరసనగా కొంతాన్‌పల్లి గ్రామంలో బుధవారం దళితులు, నాయకులు గ్రామంలో నల్ల బ్యాడ్జితో ర్యాలీ నిర్వహించి అనంతరం నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ అంబేడ్కర్ సంఘం నాయకులు దేవలింగం ఆధ్వర్యంలో శివ్వంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


కంగ్టి: సుక్కల్‌తీర్థ్‌లో విద్యార్థుల మానవహారం

నారాయణఖేడ్, సెప్టెంబరు 18: ఖేడ్‌పట్టణంలోని బుధవారం మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్, సిబ్బందితో కలిసి పలువార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై మహిళలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త తరలించే ఆటో కార్మికులకు అందజేయాలని సూచించారు. దుకాణ యజమానులకు ప్లాస్టిక్ రహితబ్యాగులను వినియోగించాలని వివరించారు.

● కంగ్టి: మండలపరిధిలోని సుక్కల్ తీర్థ్‌లో విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఎంపీడీవో సత్తయ్య బహుమతులను అందజేశారు.అనంతరం మానవ హారం నిర్వహించారు.

● కోహీర్: మండలంలోని దిగ్వాల్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో భారతి స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛతపై మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

● చిన్నశంకరంపేట: ప్లాస్టిక్ కవర్లు వాడితే అనారోగ్యాలకు గురవుతారని ఎంపీడీవో దామోదర్ హెచ్చరించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం చిన్నశంకరంపేట మండలంలోని హైస్కూల్లో విద్యార్థులకు వ్యాధుల నివారణ, స్వచ్ఛతపై ఎంపీడీవో పలు సూచనలు చేశారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

నేటి నుంచి శేఖాపూర్‌లో షేక్ షహబుద్దీన్ తుర్కి ఉర్సు

జహీరాబాద్, సెప్టెంబరు 18: మండలంలోని శేఖాపూర్ గ్రామంలో వెలసిన షేక్ శహబుద్దీన్ తుర్కి రహముతుల్లా ఉర్సు ఈ నెల 19, 20 తేదీల్లో జరుగనున్నట్టు ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. గత 674 సంవత్సరాల కాలంగ శేఖాపూర్‌లో ఈ ఉత్సవాలు కొనసాగుతున్నట్టు వారు వివరించారు. రెండురోజుల పాటు వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలను చేపడుతామని, దర్గాల్లో ప్రత్యేకప్రార్థనలు కొనసాగుతాయన్నారు. 19న గ్రామంలోని పోలీస్‌పటేల్ ఇంటినుండి దర్గా వరకు సర్కారీ గందం తీసుకెళ్తారన్నారు. 20న గ్రామంలో ర్యాలీలు, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 21న జాతర ఉత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందని ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు.

'మిలాద్-ఉన్-నబీ' కి మరింత ప్రాధాన్యత

జహీరాబాద్,సెప్టెంబరు 18: దేశవ్యాప్తంగా మిలాద్-ఉన్-నబీ పండుగకు మరింత ప్రాధాన్యత పెరిగిందని వివాహాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు గోరెమియ సికందర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహ్మద్‌ప్రవక్త జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం జరుపుకుంటారన్నారు. అందులోబాగంగ పట్టణంలోని ముస్లింలు ర్యాలీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జహీరాబాద్ ప్రాంతంలో 12ఏళ్ల నుంచి మిలాద్-ఉన్- నబీ పండుగ సందర్భంగ పట్టణంలో సామూహిక వివాహాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో 80మందికి పైగానే సామూహిక వివాహాలను జరిపించినట్టు తెలిపారు. ఈ నెల 19న జహీరాబాద్ పట్టణంలో ఈ పండుగను నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో మహ్మద్‌తంజీం, వసీంఅక్రం, అథర్, జహంగీర్, షేక్ మోయిన్, రఫీక్అన్సారి, ఇస్మాయిల్, మన్నాన్, నాజర్,అబ్దుల్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పౌర్ణమి ప్రత్యేక పూజలు

శివ్వంపేట, సెప్టెంబరు 18: శివ్వంపేటలోని శక్తిపీఠం బగలాముఖి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆలయ వ్యవస్థాపకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో మహా మంత్రహవనం నిర్వహించారు. సందర్భంగా ఆలయ ట్రస్టు మెంబర్ ప్రముఖ సంఘసేవకుడు శివకుమార్‌గౌడ్‌రమాదేవి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

● గుమ్మడిదల: బొంతపల్లి వీరన్న గూడెం వీరభద్ర స్వామి ఆలయంలో బుధవారం చండీ హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయ ఆవరణలోని యాగశాలలో చండీ హోమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సోమయ్య పలువురు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: కర్ణాటకలోని గుల్బర్గా జిల్లాలో గల గానుగాపూర్ శ్రీదత్తాత్రేయ ఆలయాన్ని పౌర్ణమి సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఉమాదేవి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ బాధ్యులు, వేదపండితులు వారిని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

● జహీరాబాద్: జహీరాబాద్ పట్టణ పరిధిలోని రంజోల్‌లో బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిద్దం ఉజ్వల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.


గానుగాపూర్‌లో ఎంపీ దంపతులకు సన్మానం


శివ్వంపేటలోని శక్తిపీఠం బగలాముఖి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: డీఆర్డీఏ పీడీ

పాపన్నపేట, సెప్టెంబరు 18: చదువుతో పాటు మహిళలు ఆర్థికంగా ఎదగాలి అని డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలన్నదే తమ అభిమతమని ఆయన తెలిపారు. మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, నెలకు కనీసం రూ.20 వేల నుంచి 30 వేలు సంపాదించేలా కృషి చేయాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సంఘాలకు పీడీ ప్రశంసా పత్రాలు అందజేశారు. వచ్చే సంవత్సరానికి ప్రతీ సభ్యురాలు కనీసం ఒక మొక్కనాటి, దాన్ని మూడేళ్లు పోషించేలా బాధ్యతలు స్వీకరించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మార్వో సతీష్, డీపీఎం కెనడీ, సీసీలతో పాటు 37 గ్రామసంఘాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


ప్రతిభ కనబరిచినవారికి బహుమతి అందజేస్తున్నపీడీ

బియ్యాన్ని తూకం వేసి ఇవ్వాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 18: రేషన్ బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి డీలర్లకు ఇచ్చే ముందు తూకం వేసి ఇవ్వాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. గోదాముల్లో తూకం వేయకుండా బియ్యాన్ని డీలర్లకు ఇవ్వడంతో తరుగు వస్తుందని, ఇన్‌చార్జిలకు చెప్పినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గన్ని బ్యాగ్స్ బిల్లు రూ.5 లక్షల 25 వేల చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ధర్మారం ఆస్పత్రిని సందర్శించిన జిల్లా వైద్యాధికారి

రామాయంపేట, సెప్టెంబరు 18: రామాయంపేట మండల పరిధి ప్రగతి ధర్మారం ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సందర్శించారు. ఆసుపత్రిలో రోగులు చికిత్స పొందుతున్న వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలని సూచించారు.

కంగ్టిలో బీసీ వసతి గృహం తనిఖీ

కంగ్టి, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని బుధవారం బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి జగదీశ్ అకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహ పరిసరాలు, విద్యార్థుల భోజనాన్ని, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారికి అందుకున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

వార్డులను సమగ్రంగా నిర్ణయించాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ జ్యోతి

హవేళిఘణపూర్, సెప్టెంబరు 18: మండలం లోని మదుల్వాయి గ్రామ ఓటర్ల జాబితాకు అనుగుణంగా వార్డుల విభజన చేపట్టాలని మదుల్వాయి మాజీ ఎంపీటీసీ జ్యోతి ప్రవీణ్ మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు తక్కువ వార్డులు ఎక్కువగా అన్న విధంగా మదుల్వాయి గ్రామ పరిస్థితి ఉందన్నారు. మండలంలోని మదుల్వాయి గ్రామాన్ని మదుల్వాయి, ముత్తాయికోట గ్రామాలుగా ఏర్పాటు చేశారని, దీనివల్ల పాత గ్రామమైన మదుల్వాయి గ్రామానికి 434 మంది ఓటర్లతో 10 వార్డులుగా విభజించారన్నారు. దీంతో గ్రామంలోని ఒక్కోక్క వార్డుకు సుమారు 43 మంది ఓటర్లు వస్తున్నట్టు తెలిపారు. అధికారులు పరిశీలించి వార్డులను సమగ్రంగా విభజించాలని ఆమె కోరింది.

అనాథాశ్రమంలో పండ్ల పంపిణీ


ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

శివ్వంపేట, సెప్టెంబరు 18: ప్రముఖ సంఘ సేవకుడు, బగలాముఖి ఆలయ ట్రస్ట్ సభ్యులు ప్రసాద్ ఛారిటబుల్ ట్రస్ట్ అశోక్ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ మండల పరిధిలోని గూడూరు గ్రామానికి చెందిన జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ జన్మదినాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు కుటుంబీకులు మగ్దుంపూర్ బేతాని సంరక్షణ అనాథాశ్రమంలో మాజీ ఎంపీపీ హరికృష్ణ చేతుల మీదుగా మానసిక వికలాంగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం నాను తండాలో విద్యార్థులకు పలకలు నోటుబుక్స్ పెన్నులు పంపిణీ చేశారు.